క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

చేగుంట (తూప్రాన్): ఐకేపీ మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా లావణ్య, కార్యదర్శిగా స్వప్న, కోశాధికారిగా రేణుకను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, సీసీలు శ్వేత రామస్వామి, అంజయ్య నాయక్, మమత, ఆయా గ్రామాల గ్రామ సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

మహిళా సమైఖ్య అధ్యక్షురాలిగా సౌజన్య



మండల మహిళా సమైఖ్య నూతన కార్యవర్గం

చిన్నశంకరంపేట(మెదక్): మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలిగా ఆవుల సౌజన్య ఎన్నికైనట్లు ఐకేపీ ఏపీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మండల ఐకేపీ సమావేశం హాలులో మహిళా సమైఖ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి నిర్మల, ఉపాధ్యక్షులుగా రాణి, సహాయ కార్యదర్శిగా కవిత, కోశాధికారిగా సంతోష ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు యశోద, రాజు, నాగరాజు, కిషన్, అకౌంటెంట్ ధనలక్ష్మి, గ్రామ సమైఖ్య సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు



ఈరన్న చెరువు నుంచి తరలించిన మట్టితో వేస్తున్న రోడ్డు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయ్యపల్లి ఈరన్న చెరువు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తరలిస్తూ కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం పక్కన కొంత మంది రియాల్టర్లు భూములు కొనుగోలు చేశారు. ఆ భూములకు రోడ్లు వేసేందుకు ఈరన్న చెరువు నుంచి మట్టిని తరలిస్తున్నారు. కొంతమంది వారికి సహకరించడంతో ఈరన్న చెరువు నుంచి ఇష్టానుసారం మట్టిని తరలిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ ఏఈ మణిభూషణ్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, చెరువును పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



రమేశ్(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన యువకుడు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట సమీపంలో 13న రాంగ్‌రూట్లో వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో మండలంలోని రాజిపేట గ్రామానికి చెందిన తోల్ల రమేశ్, ఊరట్ల లక్ష్మణ్ ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రమేశ్(22) మృతి చెందాడు. రాజిపేట గ్రామానికి చెందిన తోల్ల యాదయ్య, మంజులకు కుమారుడు, కూతురు సంతానం. కూతురు పదేళ్ల కిందట మృతి చెందగా, కుమారుడు రమేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భార్యాభర్తలు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రమేశ్ పెట్రోల్ పంపులో పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. చిన్నతనంలోనే మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

కంది తహసీల్దార్‌గా రవికుమార్

కంది(సంగారెడ్డి): కంది మండల తహసీల్దార్‌గా వి.రవికుమార్ నియమితులయ్యారు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన కందికి బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ ఆశాజ్యోతి సంగారెడ్డి ఆర్డీఓ కార్యాలయం డీఏవోగా బదిలీ అయ్యారు. గత నెల 7న బాధ్యతలు చేపట్టి ఆమె 45 రోజుల్లోనే బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది.

అన్నీ ఆన్‌లైన్‌లోనే..!

- రోజు రోజుకు పెరుగుతున్న గిరాకీ
- అత్యధికంగా స్మార్ట్ వాచ్‌లు, సెల్‌ఫోన్‌లు, టీవీలు
- స్థానిక వ్యాపారులు బేజారు



మెదక్ కలెక్టరేట్: చేతిలో ఫోన్ ఉంటే చాలు ఏ వస్తువు అయినా ఇంటి వద్దకే తెప్పించుకునే వెసులుబాటు ఉండటంతో రోజురోజుకు ఆన్‌లైన్ మార్కెట్‌కు ఆదరణ పెరుగుతోంది. చాలా మంది చిన్న వస్తువు కొనాలన్నా ఆన్‌లైన్ మార్కెట్ వైపే మొగ్గు చూపుతున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువకు లభిస్తుండటంతో డిమాండ్ ఎక్కువైంది. దీంతో పాటు ఆన్‌లైన్ మార్కెట్‌లో లభించే వస్తువులకు నిత్యం ఏదో ఒక ఆఫర్ లభిస్తుంది. పండగల సమయంతో పాటు వివిధ ప్రత్యేక రోజుల్లో మరింత ఎక్కువగా తగ్గింపులు లభిస్తాయి. దీనికి తోడూ క్రెడిట్ కార్డుల ద్వారా క్యాష్‌బ్యాక్ పొందవచ్చు. నేరుగా మార్కెట్‌లో లభించే వస్తువు ధర కంటే ఆన్‌లైన్‌లో రూ. 10 నుంచి 20 శాతం వరకు తక్కువకు లభిస్తుండడటంతో వినియోగదారులు ఆన్‌లైన్ వైపే మొగ్గు చూపుతున్నారు.

వీటికి ఎక్కువ గిరాకీ

సెల్‌ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ప్రింటర్లు, స్మార్ట్ వాచ్‌లు, దుస్తులు, మేకప్ కిట్లు, గృహోపకరణలు, సోఫాలు, కూలర్లు, ఫ్రిజ్‌లు, మిక్సీలు, వంట పాత్రలు వంటి అనేక రకాల ఎలక్ట్రానిక్ వస్తువులకు అత్యధికంగా గిరాకీ ఉంటుంది.

ఆన్‌లైన్‌లో లాభాలు

స్థానికంగా లభించని వస్తువు ఏదైనా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకోవచ్చు. అన్ని రకాలుగా వస్తువును ఆన్‌లైన్‌లో ఎన్ని సార్లయిన పరిశీలించవచ్చు. వస్తువు అందిన తర్వాతే డబ్బులు చెల్లించే వెసులుబాటు దొరుకుతుంది. నాణ్యత లేకుంటే వెంటనే తిరిగి పంపించే వెసులుబాటు ఉంది. పైగా క్రెడిట్ కార్డులుంటే పండగల సమయంలో భారీగా డిస్కౌంట్లు లభిస్తాయి.

రోజుకు 8,000 పైగా వస్తువులు

జిల్లా కేంద్రంలో రోజుకు 8000కు పైగా వస్తువులు ఆన్‌లైన్ మార్కెట్ ద్వారా ఇళ్లకు చేరుతున్నాయి. వీటిని ప్రజల వద్దకు చేర్చేందుకు జిల్లా కేంద్రంలో 8 సెంటర్లు ఉన్నాయి. కొరియర్ బాయ్ ద్వారా వాటిని ప్రజలకు చేరుస్తారు. ఇలా రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్, చేగుంట పట్టణాల్లోనూ ఒక్కో చోట 3 వరకు ఆన్‌లైన్ వస్తువులు ప్రజలకు చేర్చేందుకు కొరియర్ సెంటర్లు ఉన్నాయి. పండగలు, ఇతర ఆఫర్ల సమయంలో డెలివరి సామగ్రి సంఖ్య రెండింతలు అవుతుంది.

స్థానిక వ్యాపారుల బేజారు

రోజురోజుకు పెరుగుతున్న ఆన్‌లైన్ మార్కెట్‌తో స్థానిక వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి దుకాణాలు పెట్టి వ్యాపారం చేసే వ్యాపారులు గిరాకీలు లేక దివాలా తీస్తున్నారు. ఆన్‌లైన్ వ్యాపారానికి తట్టుకోలేక నష్టపోతున్నారు. చేసేది లేక వ్యాపారాలు మూసేసుకుంటున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



నర్సాపూర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడుతున్న జిల్లా షీ టీం సిబ్బంది

నర్సాపూర్: ఉపాధ్యాయులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా షీ టీం సభ్యుడు దేవదాసు పేర్కొన్నారు. నర్సాపూర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు కొనసాగుతున్న శిక్షణ శిబిరంలో శుక్రవారం ఆయన పాల్గొని సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండటంతోపాటు విద్యార్థులకు కూడా వివరించాలని కోరారు. శిక్షణ శిబిరంలో ఎంఈఓ తారాసింగ్ మాట్లాడుతూ టీచింగ్ మెళకువలు తెలుసుకుని మంచి బోధన చేసి విద్యార్థులను భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీం కానిస్టేబుళ్లు గంగమణి, శంకర్, రిసోర్స్ పర్సన్స్ సంతోశ్‌కుమార్, సునీత, అప్పలనాయుడు, కళారాములు, శ్రీనివాస్, శివకుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం



చందూర్‌లో తూకం వేసిన ధాన్యం బస్తాలు తడవడంతో ఆవేదన చెందుతున్న రైతు



వీరోజపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

చిలప్‌చెడ్(నర్సాపూర్): అకాల వర్షాలతో ధాన్యం బస్తాలు, కుప్పలు తడవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి తూకం వేసిన ధాన్యం బస్తాలు సైతం తడిసిపోయాయి. చందూర్ గ్రామంలో ధాన్యం లోడ్ చేసిన లారీ బురదలో దిగబడి, చాలా సేపటివరకు బయటకు రాకపోవడంతో జేసీబీ సహాయంతో బయటకు తీశారు.

భారీ వర్షం.. తడిసిన ధాన్యం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి రహదారులన్నీ చిత్తడిగా మారాయి. పలు గ్రామాల్లో చెరువుల్లో నీరు చేరింది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోయింది. ఆయా కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ శ్రీనివాస్ పరిశీలించి రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని సూచించారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



అంబాజిపేట ధాన్యం కొనుగోలు కేంద్రంను పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని తహసీల్దార్ మన్నన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్.కొండాపూర్, అంబాజిపేట, చిన్నశంకరంపేట, కామారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఇప్పటి వరకు 18 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ముగిసిందన్నారు. మండలంలో మరో 8 సెటర్లలో రెండుమూడు రోజుల్లో కొనుగోళ్లు ముగియనున్నాయని తెలిపారు.

ధాన్యం తరలింపులో ఇక్కట్లు..



కేంద్రం వద్ద దిగబడిన లారీ

శివ్వంపేట(నర్సాపూర్): వర్షం మూలంగా కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తరలించడంలో రైతులు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి నెలకొంది. శివ్వంపేటలోని కొనుగోలు కేంద్రానికి శుక్రవారం ధాన్యం తరలింపునకు వచ్చిన లారీతో పలు ట్రాక్టర్లు దిగబడటంతో ధాన్యం బస్తాలు కిందపడ్డాయి. కేంద్రం నుంచి ప్రధాన రోడ్డు పైకి లారీలు, ట్రాక్టర్లు వచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా డోజర్‌తో మట్టి రోడ్డును చదును చేశారు. ధాన్యం లోడింగ్ అనంతరం లారీలు, ట్రాక్టర్లు సక్రమంగా బయటకు వెళ్లేందుకు కేంద్రం నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖడేకు కార్పొరేటర్ సింధు రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జోనల్ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగినట్లు తెలిపారు. డివిజన్‌లో గ్రీన్ వ్యర్థాలను లిఫ్టింగ్ చేయడం లేదన్నారు. మ్యాక్స్ సొసైటీ కాలనీ వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చెత్త వేస్తున్నారని, దీంతో దుర్వాసన వస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బెల్ యాజమాన్యంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు. నూతన సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరామని తెలిపారు. ఇందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. అలాగే రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ పుష్ప జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

పంచలోహ విగ్రహాలు అందజేత

శివ్వంపేట(నర్సాపూర్) : మండల పరిధి గూడూర్‌లో నిర్మిస్తున్న శ్రీ గురుపీఠంకు దాతలు శుక్రవారం పంచలోహ విగ్రహాలు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన దత్తాత్రేయ, సాయిబాబా విగ్రహాలను శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో వడ్డేపల్లి కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం నర్సంపల్లి పెద్దతండాకు చెందిన మలోత్ హర్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో రూ.27 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శుక్రవారం బీజేపీ నాయకులు లబ్ధిదారుడు హర్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నితిన్, అశోక్, నరేష్, మధు, సుధాకర్, మహేష్, గోపాల్, నవీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ ప్రగతి ధర్మారం కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మల్లేశం, ఉపాధ్యక్షుడిగా మహేందర్‌గౌడ్, నాయకులు రాజేశం, నారాయణ, రామాగౌడ్, శ్రీశైలం, కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సుధాకర్‌రెడ్డి, వడ్ల రవీందర్, కమ్మరి కిరణ్, మల్లేశం, పిట్ల నారాయణ, స్వామి, నాగరాజు తదితరులు ఎంపికయ్యారు.

నేడు చెక్కుల పంపిణీ

తూప్రాన్: తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ శేషాద్రి శుక్రవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని సూచించారు.

టీవీ చూస్తూ గుండె పోటుకు గురై వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట(మెదక్): టీవీ చూస్తుండగా గుండెపోటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్ గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కుంట వెంకటేశం(52) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి టీవీ చూస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు మెదక్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య దుర్గమ్మ, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

మండపానికి స్థలం కేటాయించాలని వినతి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌లో లింగాయత్ సమాజ్ బాంధవులకు అనుభవ మండపం, శ్మశాన వాటిక కోసం ప్రభుత్వ భూమి కేటాయించాలని లింగాయత్ సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ షెట్కార్, ఆర్.సుభాష్ సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం హుగ్గెల్లి వద్ద ప్రతిష్ఠించిన బసవేశ్వరుడి విగ్రహావిష్కరణకు వచ్చిన సీఎంను సామూహిక ప్రార్థనలకు, శ్మశాన వాటికకు 5 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఇప్పుడే ఇలా.. వర్షాకాలంలో ఎలా..!



వై.మాందాపూర్‌కు వెళ్లే చెరువు అలుగు నీరు రహదారిపై ప్రవహించటంతో అక్కడి దుస్థితి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పైతర, ఏటిగడ్డ మాందాపూర్ గ్రామాలకు వెళ్లే అంతర్గత రహదారుల వెంట వాగులు, చెరువుల అలుగుల నుంచి నీరు రహదారులపై నుంచి ప్రవహిస్తోంది. నీరు వెళ్లేందుకు లో-లెవల్ కాజ్‌వేలు నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ లో-లెవల్ కాజ్‌వేలపై నుంచి నీరు ప్రవహిస్తుండటం, ఆపైగుంతలు కూడా ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. వేసవిలోనే ఇలా ఉంటే ఇక వర్షాకాలం ప్రారంభమైతే రాకపోకలకు మరిన్ని ఇబ్బందులు తప్పవని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. హై-లెవెల్ కాజ్‌వే నిర్మాణాలు చేపట్టాలని ఎన్నిమార్లు విన్నవించినా అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాసిరకంగా నీటితొట్లు.. జీవాల పాట్లు



నీటితొట్టికి ఏర్పడిన పగుళ్లు

వెల్దుర్తి(తూప్రాన్) : మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని శెట్టిపల్లిలో నిర్మించిన నీటి తొట్లు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. పనులను అధికారులు పర్యవేక్షించకపోవడంతో సంబంధిత గుత్తేదారు వాటిని నాసిరకంగా నిర్మించారు. నిర్మాణం చేపట్టిన కొన్ని నెలల వ్యవధిలోనే తొట్లకు పెద్ద పెద్ద పగుళ్లు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండటం లేదు. ఫలితంగా మూగజీవాలకు నీటి గోస తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ధనం దుర్వినియోగమయ్యేలా నాసిరకంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

23 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

చేగుంట (తూప్రాన్): మండలంలోని 23 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చందాయిపేట, వడియారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరో నాలుగు కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరపాల్సి ఉందన్నారు. బీ.కొండాపూర్‌లో వరి కోతలు ఆలస్యంగా జరిపినందున ఒక గ్రామానికి కొనుగోలు పొడిగించేందుకు మినహాయింపు కల్పించామన్నారు. మిగితా మూడు కేంద్రాల్లో రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిశీలనలో రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

హవేళిఘణాపూర్(మెదక్): పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి తపాస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. డైట్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌనం పాటించి, వీర సైనికుల ధైర్యసాహసాలకు మద్దతుగా జాతీయ జెండాలను ప్రదర్శించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపధ్యాయులు భాస్కర్, యాదగిరి, లక్ష్మణ్, కులకర్ణి, కృష్ణమూర్తి, మీర, రామేశ్వర్, శ్రీనివాస్ ప్రవీణ్, సుకన్య, సునీత, కవిత, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆసక్తికి అనుగుణంగా బోధన

డీఈఓ రాధాకిషన్



కొల్చారం: ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ రాధాకిషన్

కొల్చారం(నర్సాపూర్)/కౌడిపల్లి: పాఠశాల గదిలో విద్యార్థి ఆసక్తికి అనుగుణంగా బోధన సాగాలని డీఈఓ రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. తరగతి గదిలోకి వెళ్లే ముందే ఉపాధ్యాయుడు బోధనకు అవసరమైన ఉపకరణాలను సిద్ధం చేసుకొని, సరళమైన పద్ధతిలో విద్యాబోధన చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరేలా అవసరమైన అన్ని అవకాశాలను వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ సత్యనారాయణరావు తదితరులు ఉన్నారు. అనంతరం కౌడిపల్లి మండల కేంద్రంలో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను పరిశీలించారు.

'ఏ హోలిస్టిక్ వ్యూ ఆఫ్ సైన్స్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, హెచ్ఎంలు

రాయికోడ్(అందోల్): మండలంలోని అల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు శుభనయన్ నూతనంగా రచించిన ×ఏ హోలిస్టిక్ వ్యూ ఆఫ్ సైన్స్÷ పుస్తకాన్ని మండల విద్యాధికారి మాణయ్య, హెచ్ఎంలు శ్రీనివాస్, ఖైరత్ అలీలతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. రాయికోడ్‌లోని ఉన్నత పాఠశాలలో ఎంఈఓను కలిసిన శుభనయన్ తాను రచించిన పుస్తకంలోని అంశాలను క్లుప్తంగా వివరించారు. ఆంగ్లభాషలో రచించిన పుస్తకంలోని వివిధ అంశాల వారీగా తెలుగులో సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ, హెచ్ఎంలు ఉపాధ్యాయుడిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శ్రీనివాస్, ఖైరత్ అలీ, సీఆర్పీ రాజు ఉన్నారు.

విత్తనాల మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్



మాట్లాడుతున్న ఏడీఏ నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): పత్తి విత్తనాలు కొనుగోలు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రైతులు విత్తనాలు లూజ్‌గా కాకుండా ప్యాకెట్లు మాత్రమే కొనుగోలు చేయాలని, తయారైన తేదీ, ముగిసిన కాలం పరిశీలించాలన్నారు. జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ (జీఈఏసీ) నంబర్ ఉన్న విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. పక్క రాష్ట్రాల నుంచి సరఫరా అయిన విత్తనాలు, తక్కువ ధర లేక ఎక్కువ ధరకు అమ్ముతున్న విత్తనాల వివరాలు వ్యవసాయాధికారులకు తెలుపాలన్నారు. బోల్గార్డ్ -2 పత్తి విత్తనాలు 475 గ్రాముల ప్యాకెట్ ధర రూ. 901 ఉందని, అధీకృత డీలర్ వద్ద కొనుగోలు చేసి కంపెనీ పేరు, లాట్ నంబర్, విత్తన రకం, బ్యాచ్ నంబర్, ఖరీదు వివరాలు ఉండేట్లు బిల్లు తీసుకోవాలని తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264